క్లుప్తంగా

డా.కేతూరి వెంకటేష్‌కు ఘన సన్మానం



పాన్‌గల్: మండలానికి చెందిన ఏఐసీసీ జాతీయ ఓబీసీ కోఆర్డినేటర్, తమిళనాడు ఇన్‌చార్జీ డా.కేతూరి వెంకటేష్ భారత్ జోడో యాత్రను విజయవంతంగా ముగించుకొని సొంత గ్రామమైన కేతేపల్లికి వచ్చిన సందర్భంగా సోమవారం గ్రామ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. భారత్ జోడో యాత్ర ఐదు నెలలు, 4,084 కిలోమీటర్లు, 14 రాష్ట్రాల గుండా కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ వెంట యాత్ర చేసినట్లు వెంకటేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు లక్ష్మణ్, పర్వతాలు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో వనపర్తి విద్యార్థుల ప్రతిభ



వనపర్తి క్రైం: హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 12న జరిగిన అంతర్జాతీయ ఆల్ స్టైల్ కరాటే చాంపియన్ షిప్–2023 పోటీల్లో వనపర్తి గోజురియో కరాటే కిక్ బాక్సింగ్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చారు. రుద్ర, విశాల్, సిద్ధు, కీర్తన, రేణుక బంగారు పతకాలు సాధించగా.. జయకృష్ణ, కృష్ణ చైతన్య, మిస్బా కాంస్య పతకాలు, మల్లేష్ రజత పతకం సాధించారు. అంతేకాకుండా ఓవర్ ఆల్ ఛాంపియన్ షిప్ కప్‌ను సాధించారు. విద్యార్థుల వెంట అకాడమీ మాస్టర్ కరాటే శేఖర్, శివకృష్ణ ఉన్నారు.

మెటీరియల్ వితరణ



వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం అదే గ్రామానికి చెందిన చిన్ని కృష్ణ అనే యువకుడు విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేశారు. 9, 10 తరగతి చదువుతున్న విద్యార్థులకు జామెట్రీ బాక్స్‌లు, ఎగ్జామ్ ప్యాడ్స్, పెన్నులు తదితర సామగ్రినిని ఉచితంగా అందజేసినట్లు దాత తెలిపారు. విద్యలో రాణించి పాఠశాలకు తమ గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని చిన్నికృష్ణ విద్యార్థులను కోరారు.

'పాడి' అభివృద్ధికే పశువైద్య శిబిరాలు



పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): పశువులకు సీజనల్ వ్యాధులు సోకకుండా పాడి రైతులు తగిన జాగ్రత్తలు పాటించి, వాటిని కాపాడుకోవాలని మండల పశు వైద్య అధికారి డా.మాధవి సూచించారు. సోమవారం మండలంలోని తాటిపాములలో ఏర్పాటు చేసిన పశు వైద్య శిబిరాన్ని సర్పంచ్ సత్యంయాదవ్, ఎంపీటీసీ పార్వతమ్మ ప్రారంభించారు. ఈ శిబిరంలో వైద్యులు 24 పశువులకు గర్భధారణ పరీక్షలు,31 పశువులకు సాధారణ పరీక్షలు నిర్వహించినట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో డా.విజయ్‌కుమార్, జేవీఓలు హబీబ్, లలిత, రాఘవేంద్ర, వైద్యసిబ్బంది సురేష్, రైతులు పాల్గొన్నారు.

శ్మశానవాటిక స్థలం కాపాడండి

ఆత్మకూర్: పట్టణంలోని సర్వేనంబర్ 439లో మూడెకరాల వడ్డెర, బోయల శ్మశానవాటిక స్థలం కబ్జాకు గురైందని, ఆ స్థలాన్ని కాపాడాలంటూ కలెక్టర్‌కు ఆత్మకూర్ గ్రామస్తులు వినతిపత్రం అందించారు. సోమవారం వనపర్తికి తరలివెళ్లి కలెక్టర్‌ను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. మూడు తరాలుగా వడ్డెర, బోయల మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం ఈప్రాంతంలో భూముల ధరలు ఆకాశాన్నంటడంతో రియల్టర్ల కన్ను పడిందన్నారు. కొంతమంది దుర్బుద్ధితో శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేస్తున్నారని, హద్దులు గుర్తించి స్థలాన్ని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో పెద్దనర్సింహ, కురుమూర్తి, బుచ్చన్న, నాగన్న, బాలస్వామి, ఆంజనేయులు, బాలు, రాములు, నర్సింహ, చిన్న, నాగన్న తదితరులు ఉన్నారు.



ఆయకట్టుకు నీటి విడుదల

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు బహదూర్‌గూడెంలో రైతులు సాగు చేసిన పంటలను కాపాడేందుకు వీలుగా పాన్‌గల్ పాల్కి చెరువు నుంచి సోమవారం ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి, రైతు బంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యానాయుడు, ఇరిగేషన్ అధికారులతో కలిసి సాగునీటిని తూము తెరిచి కాల్వలకు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు సాగు చేసిన పంటలకు సాగునీటి కాల్వల ద్వారా సాగునీరు నిలిచిపోవడంతో పంటలు ఎండిపోకుండా ప్రత్యామ్నాయంగా చెరువులోని నీటిని విడుదల చేసినట్లు వారు పేర్కొన్నారు. చెరువు నీటిని పొదుపుగా వాడుకోవాలని వారు రైతులకు సూచించారు. సాగునీటి కాల్వల ద్వారా సాగునీరు విడుదల అయ్యే వరకు చెరువు నీరు అందుతుందన్నారు. కార్యక్రమంలో ఐబీ డీఈ వెంకటరమణదేవి, ఏఈ వెంకటయ్య, గిరిధర్‌రావు, బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాముయాదవ్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రఘుపతినాయుడు, గోప్లాపూర్ ఎంపీటీసీ కృష్ణ, డీటీ చక్రపాణి, ఆర్ఐ మహేష్, వీఆర్ఏలు వినోద, అగ్గరయ్య, రైతులు భాస్కర్‌రెడ్డి, రాములుయాదవ్, పులేందర్, బాలయ్య, నర్సింహ పాల్గొన్నారు.



పాన్‌గల్ పాల్కి చెరువు నుంచి సాగునీటిని విడుదల చేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

విద్యుత్ స్తంభాల ఏర్పాటు

మండల కేంద్రంలోని పలు కాలనీల్లో నెలకొన్న విద్యుత్ సమస్యలను తొలగించేందుకే కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు నూతన స్తంభాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీపీ మామిళ్లపల్లి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటును ఆయన పరిశీలించి ట్రాన్స్‌కో అధికారులు, కాంట్రాక్టర్‌కు పలు సూచనలు చేశారు. వీటి ఏర్పాటుతో స్తంభాల మధ్య దూరం తగ్గి, లోఓల్టేజీ సమస్య తీరుతుందన్నారు. ఎంతోకాలంగా ఇబ్బందిగా ఉన్న విద్యుత్ సమస్యను తొలగించడంపై కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు రాము యాదవ్, కాంట్రాక్టర్ రఘుపతినాయుడు, లైన్‌మెన్ రామకృష్ణ, పంచాయితీ సిబ్బంది సీతారాములు, మహేష్, కాలనీవాసలు పాల్గొన్నారు.



స్తంభాల ఏర్పాటును పరిశీలిస్తున్న నాయకులు

కనులపండువగా ఇరుముడి



సల్కెలాపురంలో ఇరుముడి పూజలో పాల్గొన్న మాలధారులు



వీపనగండ్లలో..

ఖిల్లాఘనపురం: మండలంలోని సల్కెలాపురంలో సోమవారం శివ మాలధారుల ఇరుముడి కార్యక్రమాన్ని కనులపండువగా నిర్వహించారు. గ్రామంలోని శ్రీ ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉదయం నుంచి అభిషేకం తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో 35 మంది మాలధారులు ఇరుముడి కట్టుకున్నారు. లట్టుపల్లికి చెందిన సిద్దయ్య గురుస్వామికి ఇరుముడి తలపై పెట్టి ఆలయం చుట్టుగా ప్రదక్షణలు చేశారు. అనంతరం ఆలయం ఆవరణలో స్వాములకు బిక్ష, భక్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సల్కెలాపురం శివ నామస్మరణతో మారుమోగింది.

వీపనగండ్ల: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో సోమవారం శివ మాలధారులు మహాజ్యోతిర్ముడి కార్యక్రమాన్ని నిర్వహించి కాలి నడకన శ్రీశైల దేవస్థానానికి వెళ్లేందుకు పయనమయ్యారు. మండల కేంద్రంతో పాటు కల్వరాలలో అఖండ జ్యోతిర్ముడి కార్యక్రమాన్ని నిర్వహించిన శివ మాలధారులు భక్తిశ్రద్ధలతో ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

17న మండల సర్వసభ్య సమావేశం

ఆత్మకూర్: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 17న ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అధ్యక్షతన నిర్వహిస్తున్నామని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశానికి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, వివిధ ప్రభుత్వ శాఖల కార్యక్రమాలపై సమీక్ష నిర్వహిస్తామన్నారు. ఆయా శాఖల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని, అలాగే మండలంలోని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు విధిగా హాజరు కావాలని కోరారు.

అభినందన



వనపర్తి టౌన్: మహారాష్ట్రలోని సతార జిల్లా పాడిగస్ గ్రామంలో ఈనెల 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహించిన జాతీయ చాంపియన్‌షిప్ వాలీబాల్ పోటీలో టీఎంఆర్‌జేసీ బాలికల–1 కళాశాల నుంచి వర్షితసాక్షి, అఖిల పాల్గొన్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జనార్దన్‌గౌడ్ పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో గెలుపొందిన విద్యార్థినులను సోమవారం కళాశాలలో మెమొంటోతో అభినందించారు. కార్యక్రమంలో పీడీ రాధ, స్టాఫ్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్

పెబ్బేరు: ఆరేళ్ల చిన్నారిపై హత్యాచారానికి పాల్పడిన నిందితుడి కఠినంగా శిక్షించాలని సోమవారం మైనార్టీ నాయకులు, వివిధ సంఘాల నాయకులు పట్టణ కేంద్రంలోని స్థానిక చౌరస్తాలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ దేశంలో ఫేస్‌బుక్, యూట్యూబ్, పోర్న్ వీడియా లాంటి యాప్‌ల వల్ల అశ్లీలం పెరగడంతో నిత్యం ఏదో ఇకచోట మహిళలు హత్యాచారాలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే నిందితులకు కఠిన శిక్షలు విధిస్తేనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. అలాగే ఉన్నతాధికారులు స్పందించి నిందితుడికి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

ఇద్దరికి గాయాలు

అడ్డాకుల: మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఎస్ఐ విజయకుమార్ వివరాల ప్రకారం .. షాద్‌నగర్‌కు చెందిన తౌఫిక్, ఇర్ఫాన్ మరో ముగ్గురితో కలిసి గద్వాల నుంచి స్వస్థలానికి ట్రాలీ ఆటోలో వస్తున్నారు. ఈ క్రమంలో అడ్డాకుల వద్ద ట్రాలీ ఆటో రెండు టైర్లు పగిలిపోవడంతో ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తాపడింది. ఆటోలో ఉన్న ఐదుగురిలో తౌఫిక్, ఇర్ఫాన్‌లకు తీవ్ర గాయాలు కాగా, మిగిలిన ముగ్గురు స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి బయటపడ్డారు. గాయపడిన వారిని పోలీసులు అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు. ఘటనపై విచారణ చేపట్టినట్లు ఎస్ఐ విజయకుమార్ తెలిపారు.

చెన్నకేశవరెడ్డికి మద్దతు తెలపండి

అడ్డాకుల: మార్చి 13న జరిగే ఉపాధ్యాయ శాసన మండలి ఎన్నికల్లో గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రఘురాంరెడ్డి కోరారు. మూసాపేట, పోల్కంపల్లి, నిజాలాపూర్, వేముల, జానంపేట, సంకలమద్ది కేజీబీవీ పాఠశాలలో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించి ఉపాధ్యాయులందరూ చెన్నకేశవరెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు. త్వరలోనే ఉపాధ్యాయులకు నగదురహిత వైద్యం ద్వారా హెల్త్‌కార్డులు అమలవుతాయని, వచ్చే ఏప్రిల్ నుంచి పూర్తి స్థాయిలో హెల్త్‌కార్డులు అమలు చేయించే బాధ్యత తమదేనన్నారు. వేసవి సెలవుల్లో పండిత్, పీఈటీ పోస్టులను అప్‌గ్రేడ్ చేయించే బాధ్యత సంఘానిదేనన్నారు. కార్యక్రమంలో భాస్కర్, చంద్రశేఖర్‌రెడ్డి, వై.వెంకటేశ్వర్‌రావు, రామచంద్రయ్య, బాలకృష్ణ, సాయిరాంగౌడ్, యాదయ్య, విష్ణువర్ధన్‌రెడ్డి, దానయ్య, పరమేష్, రాజేష్ తదితరులు ఉన్నారు.

అంధత్వ నివారణకే 'కంటివెలుగు'

కొత్తకోట: అంధత్వ నివారణకే కంటివెలుగు పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిందని జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్ అన్నారు. సోమవారం మండలంలోని చర్లపల్లిలో కంటివెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఎంతో మంది పేదలు కంటి చూపు సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఖరీదైనా వైద్యం చేయించుకోలేక, కార్పొరేట్ స్థాయి ఆస్పత్రులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్న సామన్య ప్రజలకు కంటివెలుగు పథకం వరప్రసాదం అన్నారు. వైద్యులు గ్రామాలకు వచ్చి నేరుగా కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలను ఇస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రూప శ్రీ, ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, సర్పంచ్ శేఖర్‌రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



చర్లపల్లిలో మాట్లాడుతున్న జెడ్పీ వైస్‌చైర్మన్ వామన్‌గౌడ్

416 మందికి..

పాన్‌గల్: మండల కేంద్రంతో పాటు కేతేపల్లి, బుసిరెడ్డిపల్లి గ్రామాల్లో సోమవారం నిర్వహించిన కంటివెలుగు కార్యక్రమంలో 416 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్ రెడ్డి తెలిపారు. వీరిలో 50 మందికి కంటి అద్దాలు, 17 మందిని కంటి ఆపరేషన్ నిమిత్తం సిఫార్సు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

కేంద్రాల పరిశీలన

మండలంలోని బహదూర్‌గూడెంలో బుధవారం నుంచి, చిక్కేపల్లిలో గురువారం నుంచి ప్రారంభించే కంటివెలుగు శిబిరాల ఏర్పాటు కోసం వసతును స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి డాక్టర్, వైద్య సిబ్బంది పరిశీలించారు. కంటి వెలుగు కేంద్రాలకు ప్రజలు ఎక్కువ మొత్తంలో హాజరై పరీక్షలు చేయించుకునేలా అవగాహన కల్పించాలని సూచిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విష్ణునాయుడు, బాలస్వామియాదవ్, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

96 మందికి..

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): మండలంలోని వెంకటాపురం పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమంలో 96 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో తొమ్మిది మందికి రీడింగ్ అద్దాలను పంపిణీ చేశామని, 11 మందికి అవసరమైన అద్దాలను తయారీకి పంపిచామన్నారు. ఏడుగురిని ఆపరేషన్ అవసరం ఉన్న వారిగా గుర్తించామని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎం అనురాధ, భాగ్యలక్ష్మి, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



చిక్కేపల్లిలో..

ఖిల్లాఘనపురం: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆముదంబండతండా సర్పంచ్ మణి, వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ సౌజన్యలత తెలిపారు. మండలంలోని రెండు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోమవారం మొత్తం 270 మందికి కంటి పరీక్షలు చేశారు. ఖిల్లాఘనపురం పీహెచ్‌సీ పరిధిలోని ఆముదంబండతండాలో 154 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 33 మందికి అద్దాలు అందించి, 16 మందిని ఆపరేషన్ సిఫార్స్ చేశారు. కమాలోద్దీన్‌పూర్ పీహెచ్‌సీ పరిధిలోని రోడ్డుమీదితండాలో మొత్తం 116 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 10 మందికి కంటి అద్దాలు అందించి, ముగ్గురిని ఆపరేషన్ అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో డాక్టర్ రాంచందర్‌రెడ్డి, మక్బూల్ పాష, ఏఎన్ఎంలు, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఆముదంబండతండాలో..

కేతేపల్లి ఎస్‌బీఐ ఎదుట సీపీఐ ధర్నా

పాన్‌గల్: అదానీ కంపెనీల్లో కేంద్ర ప్రభుత్వ పెట్టుబడులను నిరసిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో కేతేపల్లి ఎస్‌బీఐ ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీరామ్ మాట్లాడారు. అదానీ వ్యాపారాలపై హిడెన్ బర్గ్ నివేదిక ఆధారంగా విచారణ జరిపి నిజాలు నిగ్గు తేల్చేందుకు జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని ఆయన డిమాండ్ చేశారు. అదానీ కంపెనీల షేర్ల విలువ పడిపోయి రూ.10 లక్షల కోట్ల దేశ ప్రజల సంపద ఆవిరి అయిందని ఆరోపించారు. ఆర్బీఐ, ఎల్ఐసీ, ఎస్‌బీఐల నుంచి రూ.వేల కోట్లు అదానీ అప్పులు తీసుకున్నారని, ప్రధాన మంత్రి నరేంద్రమోదీ అండతోనే ఇదంతా జరిగిందని దుయ్యబట్టారు. దేశంలో 28 మంది పారిశ్రామిక వేత్తలు బ్యాంకుల నుంచి రుణాలు ఎగొట్టి విదేశాలకు పారిపోయారన్నారు. ఆయా పారిశ్రామిక వేత్తలు కేంద్ర ప్రభుత్వ అండతోనే ఈ రుణాలు పొందారని ఆరోపించారు. పారిశ్రామిక వేత్తలకు కేంద్ర ప్రభుత్వం కొమ్ముకాస్తూ పేదల ఇబ్బందులను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్యాంకు మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు కాకంబాలస్వామి, మండల నాయకులు కుర్మయ్య, పెంటయ్య, మాల కుర్మయ్య, కాశన్న, హన్మంతు, చిన్నకుర్మయ్య, హుస్సేన్, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీఐ ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

పాన్‌గల్: ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ విద్యార్థులకు ఆదర్శంగా నిలువాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. సోమవారం మండలంలోని దావాజిపల్లి ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి ప్రార్థనలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతం పరిశీలించారు. తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా తరగతుల వారీగా తెలుగు, ఇంగ్లిష్, గణితంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించి వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం గోప్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి మన ఊరు–మన బడి పథకం అభివృద్ధి పనులను పరిశీలించారు. ఆయా పనులను నాణ్యతగా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ సత్తయ్య, హెచ్ఎంలు బద్రూనాయక్, శ్రీనివాసులు, సీఆర్పీ గోవింద్‌నాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



ప్రార్థనలో పాల్గొన్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం



పెబ్బేరు: మండలంలోని రంగాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తరగతి గదిలో తోటి విద్యార్థులుకు విద్యా బోధన చెప్పారు. అలాగే తరగతిలో పాఠాలు చక్కగా వివరించడంతో విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, ఉపాధ్యాయుల బృందం తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి

ఆత్మకూర్: మహిళలు రుణాలు పొంది వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా రాణించాలని పురపాలిక కమిషనర్ బీఎన్‌కే రమేష్, మెప్మా డీఎంసీ బాలరాజు అన్నారు. సోమవారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయంలో మహిళాసంఘాల సభ్యులు, ఆర్పీలతో సమావేశమయ్యారు. మున్సిపాలిటీ పరిధిలో 162 సంఘాలు ఉండగా 2,162 మంది సభ్యులు కొనసాగుతున్నారన్నారు. గతంలో తీసుకున్న రుణాలను చాలా మంది తిరిగి చెల్లించారని తెలిపారు. రుణాలు చెల్లిస్తేనే కొత్తగా రుణాలు అందిస్తామని పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. ఆత్మకూర్‌లో 452 మంది వీధి వ్యాపారస్తులకు రూ.10వేలు చొప్పున రుణాలు అందించామని వెల్లడించారు. ఇందులో 138 మంది తిరిగి చెల్లించడంతో రూ.20వేల చొప్పున రుణాలు అందించామని, ఈ బకాయిలను చెల్లించిన వారికి రూ.50వేలు చొప్పున రుణాలు అందిస్తామని సూచించారు. ఈ అవకాశాన్ని వీధి వ్యాపారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో అధ్యక్షురాలు ఉమాదేవి, కార్యదర్శి మంజుల, సంఘాల సభ్యులు, ఆర్పీలు ఉన్నారు.



మాట్లాడుతున్న కమిషనర్ రమేష్

ఆకాశవాణి గాయకులకు సన్మానం

వనపర్తి టౌన్: విజ్ఞాన, వినోదాల వారధి రేడియో అని సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు శంకర్‌ప్రసాద్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు సాహితీ కళావేదిక ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని రేడియంట్ స్కూల్‌లో రాత్రి ఆకాశవాణి గాయకులు, కవులు తాళాల రమాకాంత్, బైరోజు చంద్రశేఖర్, డాక్టర్ శ్యాంసుందర్, పోల్కంపల్లి సుజాత, గుడిసె శివలింగం ను డోలు విద్యాంసులు కల్వరాల శ్రీనివాసులు, ఆకాశవాణి విలేకరి సుజీత్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శంకర్‌ప్రసాద్ మాట్లాడుతూ.. టీవీ ప్రాచుర్యం పెరగక ముందు చాలామటుకు వ్యాఖ్యాతలు, న్యూస్ రీడర్లు, కవులు, రచయితలు, ఆకాశవాణి ద్వారా ప్రసిద్ధి పొందారని గుర్తుచేశారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు కందూరు నారాయణరెడ్డి, రాములు, బండారు శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.



కవులను సన్మానిస్తున్న నాయకులు

కలెక్టర్ నివాసంలో పాము కలకలం

వనపర్తి: జిల్లా కేంద్రంలోని సమీకృత నూతన కలెక్టరేట్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయం (నివాసం) లోకి సోమవారం రాత్రి పదిగంటల సమయంలో నాగుపాము వచ్చింది. విషయం గమనించిన సిబ్బంది సాగర్స్ స్నేక్ సొసైటీ వారికి సమాచారం అందించగా.. వారు వెంటనే స్పందించి నాగుపామును చాకచక్యంగా పట్టుకున్నారు. పామును డబ్బాలోకి తీసుకుని ఉదయం అటవీ ప్రాంతంలో వదిలేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ మాట్లాడుతూ.. పాము ప్రమాదకారే అయినా.. వాటిని సంరక్షించి అటవీ ప్రాంతంలో వదలటం, ఇదొక సామాజిక కార్యక్రమంగా ఎలాంటి లాభాపేక్ష లేకుండా పని చేస్తున్న సాగర్ టీం సభ్యులను అభినందించారు. పామును పట్టుకున్న వారిలో శివ, అనిల్ ఉన్నారు.



పామును పట్టుకున్న సొసైటీ సభ్యులను అభినందిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

ఎమ్మెల్సీ అభ్యర్థి కాటేపల్లిని గెలిపించాలని ప్రచారం

కొత్తకోట: ఎమ్మెల్సీ అభ్యర్థి కాటేపల్లి జనార్దన్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.చెన్నయ్య కోరారు. మండలంలోని అమడబాకుల, పాలెం, సంకిరెడ్డిపల్లి జెడ్పీహెచ్ఎస్ పాటు అమడబాకుల మోడల్ స్కూల్, కస్తూర్బా పాఠశాలలో సోమవారం ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. కాటేపల్లి జనార్దన్‌రెడ్డి అభ్యర్థన మేరకు ఉపాధ్యాయులకు సంబంధించిన ఈహెచ్ఎస్ సౌకర్యాన్ని ఈ బడ్జెట్‌లో ప్రస్తావించి ఉపాధ్యాయుల నుంచి 1 శాతం మూలవేతనం, ప్రభుత్వం నుంచి కొంత కార్పస్‌ఫండ్‌ను కేటాయించి ఒక కమిటీ ఏర్పాటు చేసి ఏ కార్పొరేట్ ఆస్పత్రిలో అయినా క్యాస్‌లెస్ ట్రీట్‌మెంట్‌తో వైద్యం జరిగేలా చూస్తామన్నారు. ఈ స్కీం ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తుందన్నారు. ఆయన వెంట పీఆర్‌టీయూ తెలంగాణ రాష్ట్ర కోశాధికారి చంద్రశేఖర్‌రావు, జిల్లా గజిటెడ్ ఉపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి గణేష్‌కుమార్, పీఆర్‌టీయూ తెలంగాణ వనపర్తి జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, ఆర్.శ్రీనువాసులు తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న చెన్నయ్య